క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి ఏలూరు జిల్లాకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన నిడదవోలు శివప్రసాద్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి ఎన్ లక్ష్మీ ప్రశాంతి పేరిట రూ.1,00,001 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కలి ్పంచారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ అధికారి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

రుతుక్రమంలో పరిశుభ్రత ముఖ్యం



ఆడపిల్లలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ఆడపిల్లలు రుతుక్రమం, పరిశుభ్రత సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ఆరోగ్య వంతులుగా ఉండవచ్చునని గణపవరం మండలం పిప్పర సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని అన్నారు. గురువారం స్థానిక సీహెచ్‌సీ పరిధి గ్రామాల్లోని వెల్‌నెస్ కేంద్రాల వద్ద యుక్తవయస్సు ఆడపిల్లలకు రుతుక్రమ సమస్యలపై అవగాహన కల్పించారు. చిలకంపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రుతుక్రమం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత విషయంలో పాటించాల్సిన పద్ధతులు, నాప్‌కిన్స్ వినియోగం తదితర అంశాలను వివరించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యం

భీమడోలు: కార్మిక రాజ్య స్థాపన కోసం సీఐటీయూ ఆవిర్భవించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పూళ్ల గ్రామంలో ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు అప్పారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ పోస్ట్‌మాస్టర్ షరీఫ్



ఉత్తమ పోస్ట్ మాస్టర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

గణపవరం(ఉంగుటూరు): ఉంగుటూరు పోస్ట్ మాస్టర్ షరీఫ్‌కు ఉత్తమ పోస్ట్‌మాస్టర్ అవార్డు లభించడం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. గురువారం ఉంగుటూరు గ్రామంలో పోస్టాఫీసు సిబ్బంది ఉత్తమ పోస్ట్‌మాస్టర్ అవార్డు పొందిన షరీఫ్‌ను ఘనంగా సన్మానించారు. పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బంది సహకారంతోనే తనకు ఉత్తమ పోస్ట్ మాస్టర్‌గా, పోస్టాఫీసుకు ఉత్తమ పోస్టాఫీసుగా అవార్డులు వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సకల కొత్తపల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ

పెదపాడు : మండలంలోని సకల కొత్తపల్లి గ్రామంలో విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు పాల్గొని విఘ్నేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ చేపేని రంగారావు, వైకుంఠపు ధనంజయ్, గంపా వెంకటేశ్వరరావు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖాతాల్లో తగిన నగదు ఉంచాలి

దెందులూరు: ప్రధాన మంత్రి ఇన్సూరెన్స్ స్కీమ్‌ల రెన్యూవల్‌కు ఖాతాదారులు తగిన నగదు లబ్ధిదారుల ఖాతాల్లో ఉండాలని దెందులూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగార్జున అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రీమి యం మొత్తం రూ.456, పీఎంఎస్‌బీవై రూ.20, పీఎంజేజేబీవై రూ.436, ఈ నెల 31వరకు ఖాతాల్లో నగదు నిల్వ ఉంచాలని అన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు



ఉంగుటూరు మండలంలో ఏపుగా పెరిగిన పిల్లిపెసర్లు



ఏపుగా పెరిగిన జీలుగ

- పంటల అధిక దిగుబడులకు ఆస్కారం
- సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తున్న ప్రభుత్వం

ఉంగుటూరు: పచ్చిరొట్ట సాగు చేయడంతో చేలల్లో భూసారం పెంపుతోపాటు, పంటల అధికదిగుబడులు సాధించవచ్చు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టను సాగుచేయడం మేలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వాడడంవల్ల నేల సారం దెబ్బతినడంతోపాటు పంటలు కలుషితమవుతాయి.

పచ్చిరొట్ట పెంపకంతో ప్రయోజనాలు ఇలా..

- పచ్చిరొట్ట వేయడం వల్ల నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సూక్ష్మ జీవులు పెరిగి జీవ రసాయనిక చర్యలు కూడా జరుగుతాయి. దీంతో నేలసారంతోపాటు ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలోని చాలా రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయి.
- ఎరువులు వేసినపుడు నేలలోని సూక్ష్మ జీవులు పెంచుతాయి.
- పప్పు జాతి పంటలతో రైజోబియం బ్యాక్టీరియా పెరిగి ఎకరానికి 20 నుంచి 50 కేజీలు నత్రజని అందుతుంది. ఈ మేరకు ఎరువులు తగ్గించుకోవచ్చు.
- కలుపు మొక్కలు పెరగకుండా కాపాడతాయి.
- భూమి లోతుల్లో ఉన్న పోషకాలను ఉపరితలానికి తీసుకొచ్చి పంట మొక్కలు వాటిని వినియోగించుకునేలా మారుస్తాయి.
- పశువులు మేతగా కూడా ఉపయోగపడతాయి.

పచ్చిరొట్టలో రకాలు

పచ్చి రొట్టగా ఏ తరహా మొక్కలను పెంచాలన్నది పంటలు పండిస్తున్న నేలపై ఆధారపడుతుంది. మొత్తంగా ఇలా పండించడానికి అనువుగా 16 రకాల మొక్కలు అందుబాటులో ఉంటాయి.

- జీలుగ, అవిసె, జనుము, వెంపలి, అలసంద, పిల్లి పెసర, పెసర, మినుములు, గోరు చిక్కుడు, అజొల్లా, కానుగ, వేప, గ్లెరిసిడియా, జిల్లేడు, నేతల తంగేడు, కొండ మిరప మొక్కలను విత్తుకోవచ్చు.
- వీటిలో జీలుగ పంటను ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాన్ని ఇసుకతో కలిపి పొలం అంతా చల్లుకోవాలి. పూత దశకు వచ్చాక కలియదున్నితే ఎకరానికి 9 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.
- జనుమును అన్ని నేలల్లోనూ పెంచుకోవచ్చు. దీన్ని పశువులకు మేతగా కూడా వాడవచ్చు.
- పిల్లిపెసరను చౌడు భూముల్లో తప్ప వేరే నేలల్లో పెంచవచ్చు. ఇవి 10 కేజీల విత్తనాలు వేస్తే 5 నుంచి ఆరుటన్నులు పచ్చిరొట్ట లభిస్తుంది. పెసర, మినుము పంటలు వేయడంవల్ల పశుగ్రాసంతో పాటు భారీగా పచ్చిరొట్ట కూడా లభిస్తుంది. పెసర, మినుము పంటలను వేయడం వల్ల పశువులకు గ్రాసంతోపాటు పచ్చిరొట్ట కూడా లభిస్తుంది.
- జనుము, జీలుగ పిల్లిపెసర, మినుము, పెసర వంటి మొక్కలన్నింటినీ విత్తనాలను చేలల్లో దుక్కి దున్ని వెదజల్లాలి. పూత దశకు చేరుకున్న తర్వాత పొలంలో వీటిని కలియదున్ని ఈ ఆకులు నేలలో మురిగిన తరువాత పంటలు వేసుకోవాలి. దీనివల్ల మొక్కలు వేగంగా పెరుగుతాయి. వేప, తంగేడు, కానుగ వంటి మొక్కలైతే వాటి కొమ్మలు, ఆకులు సేకరించి పొలంలో పూర్తిగా చల్లుకొని కలియదున్ని మురగనివ్వాలి. ఇవి మురిగిన తరువాత ప్రధాన పంట వేసుకోవాలి. వీటిని వేసవి నెలల్లోనే అంటే ప్రధాన పంట వేయడానికి రెండు నెలలు ముందుగానే పెంచుకోవాలి. మురగడానికి సమయం పడుతుంది కాబట్టి ప్రధాన పంట వేయడానికి ముందు దీన్ని కలియ దున్నుకోవాలి. పూత దశలో ఉన్నపుడే కలియ దున్నితే ఎక్కువ పోషకాలు నేలలోకి చేరతాయి.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



పచ్చిరొట్ట పెంచడం వల్ల భూసారం పెరుగుతుంది. భూమిలో పోషక విలువలు పెరిగి పంటల అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులు పచ్చిరొట్టలు పెంచడానికి అలవాటు పడాలి. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి.

– బాలిన వెంకటేష్, వ్యవసాయ అధికారి, ఉంగుటూరు

'అవాంఛనీయ ఘటనలకు తావివ్వకండి'



సిబ్బందికి దిశ నిర్దేశం చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

పెదవేగి : జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ సందర్భంగా పెదవేగి సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. శాంతిభద్రతల విషయాలపై గురువారం పెదవేగి సర్కిల్ ఆఫీస్‌లో ఎస్పీ సమావేశం నిర్వహించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ముందస్తు బైండోవర్లు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని చెప్పారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా పోలీస్ కేసుల్లో ఇరుక్కుంటే కలిగే అనర్థాలను గురించి ప్రజలకు వివరించాలన్నారు. నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య, పెదవేగి సీఐ కె.శ్రీనివాసు కుమార్, పెదవేగి సర్కిల్ ఎస్సైలు స్వామి, రాజంద్ర ప్రసాద్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: గుడిగుంట సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీవీ నటరాజన్ తెలిపారు. గంగన్నగూడెం, అక్కిరెడ్డిగూడెం, నాగులదేవునిపాడు, గోపన్నపాలెం, కొప్పులవారిగూడెం, నాగన్నగూడెం, ఎన్ఆర్‌సీ ఆయిల్‌పామ్, ఎంఆర్‌సీ కాలనీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సెల్ ఫోన్లు వద్దు.. పుస్తకాలే ముద్దు



భీమడోలు లైబ్రరీలో ధ్యానం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: సెల్‌ఫోన్లు వద్దు.. పుస్తకాలే ముద్దు అనే నినాదంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చేపట్టిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శాఖా గ్రంథాలయాల్లో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో గత 13 రోజులుగా వినోదం, విజ్ఞానాన్ని పెంపొందించేలా, విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని అలవర్చేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు నీతి కథలను వినడం, చెప్పడం, పుస్తకాలు చదివి వాటి సమీక్షలు రాయడం వంటి అంశాలపై పట్టు సాధించేలా శిక్షకులు వారికి చక్కని తర్ఫీదు అందిస్తున్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు లెక్కల సబ్జెక్ట్‌లో మెలకువలు, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఇంగ్లిషు గ్రామర్‌ను చిన్నారులకు బోధిస్తున్నారు. సామూహిక పుస్తక పఠనం చేస్తున్నారు. తొలుత చిన్నారులు యోగాసనాలు, ధ్యాన కృత్యాలు నేర్పించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారులతో లూడో, చదరంగం, క్యారమ్స్ వంటి ఆటలు ఆడుతున్నారు. ధ్యానం చేస్తున్నారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకుడు డీఎస్ బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



నిడమర్రు: చానమిల్లిలో మాట్లాడుతున్న సీఐ సుభాష్



గణపవరం: సరిపల్లెలో మాట్లాడుతున్న సీఐ సుభాష్



భీమడోలు: మల్లవరంలో యువకులకు సూచనలిస్తున్న సీఐ రవికుమార్, చిత్రంలో ఎస్సై వై.సుధాకర్

నిడమర్రు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకుని గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిడమర్రు సీఐ ఎం సుభాష్ హెచ్చరించారు. గురువారం చానమిల్లి, అడవికొలను గ్రామాల్లో నిడమర్రు పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికల నియమ నిబంధనలు, నియమావళిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సీఐ సుభాష్ మాట్లాడుతూ జిల్లాలో 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ ఎన్నికలు ముగిసే వరకూ అమల్లో ఉంటుందని చెప్పారు. కౌంటింగ్ రోజు, తర్వాత రోజుల్లో గ్రామాల్లో అల్లర్లు, దాడులకు ప్రయత్నిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై ఆర్ శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

సోదర భావంతో మెలగాలి

గణపవరం: గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలూ పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా కలిసి మెలిసి సోదర భావంతో మెలగాలని సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. గురువారం గణపవరం మండలం సరిపల్లె, గణపవరం గ్రామాల్లో ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఆవేశకావేశాలకు లోనుకాకుండా సంయమనంగా వ్యవహరించాలని సూచించారు. గొడవలు, గలాటాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రవర్తించాలని సూచించారు. ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144వ సెక్షను అమలులో ఉంటుందని, 30 పోలీస్ యాక్టు జిల్లా వ్యాప్తంగా అమలులో ఉందని చెప్పారు. ప్రజలు గుమిగూడటం, వాదోపవాదాలకు దిగడం, ఊరేగింపులు చేయడం వంటివాటికి దూరంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు దూరంగా ఉండండి

భీమడోలు: ఎన్నికల ఫలితాల వెలువడే వేళ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా శాంతి కమిటీలు సహకరించాలని సీఐ బీబీ రవికుమార్ కోరారు. ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన శాంతి కమిటీల సభ్యులు, పెద్దలతో సమావేశాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు విడుదలైన తర్వాత వివిధ పార్టీల నాయకులు, ప్రజలంతా అల్లర్లు, గొడవలు వంటి వివాదాలు తావివ్వకుండా కలిసిమెలిసి మెలగాలని రవికుమార్ సూచించారు. శాంతిభద్రతలను పరిరక్షించేలా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత 6వ తేదీ వరకు గ్రామాల్లో ఎన్నికల కోడ్ అములులో ఉంటుందని తెలిపారు. పోలీసు సిబ్బంది, శాంతి కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి లిల్లీ పువ్వులతో పూజ



కళాకారుల నృత్య ప్రదర్శన



అభయాంజనేయస్వామికి పూజ చేసిన అర్చకుడు రామాచార్యులు

పెదపాడు : మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి గురువారం 1008 లిల్లీ పూలతో పూజ చేశారు. తొలుత గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి భజన సమాజం రేమల్లే వారిచే నక్షత్ర హారతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దాతల సహకారంతో ప్రత్యేక ప్రసాదాలను తయారు చేసి భక్తులకు పంచారు. రాత్రి ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం రేడియో టీవీ ఆర్టిస్టు శివకుమార్‌చే భక్తిగాన సుధ కార్యక్రమం నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్



నిడమర్రు : మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పెదపాడు : మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో ఆర్డినేటర్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. పెదపాడు మండలంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో భోజనం చేసినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఈ మేరకు ప్రతి ఏజెన్సీ చర్యలు తీసుకోవాలని సూచించారు. భోజనం వండే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. వండిన వంటలను రుచి చూసి అభినందించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ జొన్నకూడి జయమ్మ, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, దేవినేని వెంకటరమణ, మండల రిసోర్స్ పర్సన్ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలి

నిడమర్రు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నడిపించాల్సిన బాధ్యత నిర్వాహకులపైనే ఉందని ఎంఈఓలు పి.శేషు, కె.రాంబాబు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిడమర్రు విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రోజువారీ మెనూ సక్రమంగా పాటించాలని, ప్రమాణాల మేరకు ఆహార పదార్థాలను తయారు చేయాలని సూచించారు. వంట చేసే పరిసర ప్రాంతాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈసందర్భంగా ఆహారంలో పోషకాలు నష్టపోకుండా వండటం తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

దేశ పురోగతి యువతతోనే సాధ్యం



క్యాడెట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ

పెదవేగి: దేశ పురోగతి యువతరంతోనే సాధ్యమని 19వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ అన్నారు. ఎంఆర్‌సీ కాలనీలోని స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 21న ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ముగింపు శిబిరంలో కాకినాడ గ్రూపునకు చెందిన పలు యూనిట్ల నుంచి మొత్తం 501 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. శిబిరంలో భాగంగా క్యాడెట్లతో వెపన్ ఫైరింగ్, డ్రిల్‌తో పాటు ట్రాఫిక్ ర్యాలీ, హెచ్ఐవీ, ప్రకృతి, అటవీ సంరక్షణ, క్యాన్సర్, స్వచ్ఛభారత్, రక్తదానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మస్థైర్యం, క్రమశిక్షణ, ఐకమత్యం, సవాల్‌ను స్వీకరించే పోటీతత్వం, వ్యక్తిత్వ వికాసం, ప్రేమాలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి క్యాడెట్లలో జాతీయ సమైక్యత, సేవాభావం సమాజంపై బాధ్యత పెంపొందించుకోవాలని కల్నల్ సౌరబ్ ముఖర్జీ సూచించారు. అధికారులు మాట్లాడుతూ క్యాడెట్లలో మానసిక వికాసం కొరకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వారిలో నూతనోత్సాహాన్ని నింపామన్నారు. పలు పోటీలలో గెలుపొందిన ఎన్‌సీసీ కెడెట్‌లకు కల్నల్ సౌరబ్ ముఖర్జీ బహుమతులు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ అధికారులు ఫస్ ఆఫీసర్ శేఖర్ కుమార్, లెఫ్టినెంట్ పి.సోమశేఖర్, సెకండ్ ఆఫీసర్ అనంత పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ భద్రత పరిశీలన



సీఆర్‌ఆర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలిస్తున్న లావణ్యవేణి

పెదపాడు : మండలంలోని వట్లూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దెందులూరు నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులతో కలిసి జాయింట్ కలెక్టరు బి.లావణ్యవేణి గురువారం పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు మూడు అంచెల భద్రత ఏర్పాటుచేశామని, తలుపులకు వేసిన తాళాల సీళ్లను పరిశీలించామని ఆమె చెప్పారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. పరిశీలన అనంతరం లావణ్యవేణి సందర్శకుల రిజిష్టరులో సంతకం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ స్వరూపరాణి, ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజవల్లి, నియోజకవర్గ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.